విశాఖపట్టణం
గురువారం 21 మే 2026

For a pure tomorrow..

# జయజయహే

jayajayahey.in | సంపుటి: 9 | సంచిక: 117 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## 59 ఏళ్ల తర్వాత తమిళ క్యాబినెట్‌లోకి కాంగ్రెస్

2

ఇద్దరు ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు



## కుల గణన జరగాల్సిందే..

బీసీ జనాభా లెక్క తెలియాలి

సంక్షేమ పథకాలు కులాల ప్రాతిపదికనే కదా

రాజకీయ అవసరాలకు డేటా వాదనను ఏకీభవించలేం

కులగణన పిటీషన్ పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలో జరుగుతున్న జనాభా గణనలో కులాల వివరాలను సేకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. సంక్షేమ చర్యలు చేపట్టాలంటే వెనుకబడిన కులాల్లో ఎంత మంది జనాభా ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది అని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. జనాభా గణన కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. సుధాకర్ గుమ్ముల అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కోర్టు తోసిపుచ్చింది. కుల గణన వల్ల రాజకీయ ప్రయోజనాల కోసం డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని పిటిషనర్ వాదించారు. కులాల వారీగా వివరాలు ..మిగతా 2లో

# ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యం

దేశానికి మన విధానం ఆదర్శం కావాలి

ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పోకస్ చేయాలి

ప్రపంచస్థాయి ప్రమాణాలతో పబ్లిక్ స్కూల్ పాలసీ

డ్రాపవుట్స్ ను తగ్గించి తిరిగి చేరేలా కృషి చేయాలి

మంత్రి నారా లోకేశ్ కీలక దిశానిర్దేశం

(అమరావతి - జయజయహే)

దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సరికొత్త యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించి, నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ సాధనపై అధికారులు, ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో దృష్టి సారించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన పబ్లిక్ స్కూల్ విద్యా విధానాన్ని తీసుకురావడానికి క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగా విద్యాశాఖలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో మంత్రి నారా లోకేశ్ డీఈవోలు, ఈపీసీలతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీలో అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ ప్రకటించారు. ఇందులో భాగంగానే మన ఉపాధ్యాయులను విదేశాలకు పంపి, అక్కడ అధ్యయనం చేసిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తామని వెల్లడించారు. ఓపెన్ మార్కెట్‌తో పోటీపడేలా విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. గతంలో విద్యాశాఖలో కనీస డేటా బేస్, విజిబిలిటీ లేని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ఈ లోపాన్ని సవరిస్తూ, పక్కా సమాచారంతో కూడిన డ్యాష్ బోర్డును సిద్ధం చేశామని దీని ఆధారంగానే డీఈవోలు, ఏపీసీలు భవిష్యత్ కార్యాచరణను అమలు చేయాలని ..మిగతా 2లో



## క్లీన్ ఎనర్జీ క్యాపిటల్ రాయలసీమ

కేవలం 11 నెలల్లో రూ. 3 వేల కోట్ల ప్రాజెక్టు పూర్తి

మే 22న లాంఛనంగా ప్రారంభోత్సవం గర్వకారణం

సోషల్ మీడియాలో పోస్టు చేసిన మంత్రి నారా లోకేశ్

రిపోస్టు చేసి హర్షం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు

2

# లంచగాండులను పట్టిస్తే రూ. లక్ష బహుమతి

లంచం అడిగితే వీడియో తీసి పంపండి చాలు

అవనీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తా

తమిళనాడు సీఎం జోసెప్ విజయ్ ఆఫర్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త శకం మొదలైంది. వెండితెరపై అవినీతిపై పోరాడే ‘దళపతి’గా పేరు తెచ్చుకున్న విజయ్, ఇప్పుడు నిజ జీవితంలోనూ అదే దూకుడు ప్రదర్శిస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే లంచగొండుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే.. ఒక్క వీడియో తీసి పంపితే చాలు, మీ అకౌంట్‌లో రూ. 1 లక్ష నగదు చేరుతుంది. రాష్ట్రంలో లంచగొండితనాన్ని వేళ్లతో సహా పెకిలించేందుకు విజయ్ ప్రభుత్వం సరికొత్త అస్త్రాన్ని ప్రయోగించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్‌లైన్ నంబర్, ..మిగతా 2లో



## అతి అభినయం!

పాస్టర్ దర్శన్ పై దాడి కేసు

విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి

పెళ్లిళ్లు.. మోసాలు.. వివాహేతర సంబంధాలు

భరోసా పార్టీ పేరుతో వసూళ్లకు పాల్పడి జల్సాలు

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బార్దర్ దర్యాప్తులో బట్టబయలు

(అల్లూరి జిల్లా - జయజయహే)



అల్లూరి జిల్లా పాడేరులో పాస్టర్ అభినయ్ దర్శన్‌పై దాడి ప్రచారం ముందస్తు కుట్రలో భాగమేనని గుర్తించినట్లు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ స్పష్టం చేశారు. కొంతమందిని డబ్బు ప్రలోభాలకు గురిచేసి ఘటనలో భాగస్వాములను చేశారని విచారణలో తేలిందన్నారు. ఘటనను ముందుగానే చిత్రీకరించి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారన్నారు. ప్రజల్లో భయాందోళనలు, మత విద్వేషాలు రేకెత్తించే ఉద్దేశంతో వ్యవహరించారన్నారు. తద్వారా ..మిగతా 2లో



## నిప్పుల కుంపటి

భగభగలాడుతున్న రాష్ట్రం

47.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

మరోవైపు సమీపిస్తున్న రుతుపవనాలు

కొన్ని ప్రాంతాలకు వర్ష సూచన

(అమరావతి - జయజయహే)

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రికార్డు స్థాయిలో 44 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. ఎండలతోపాటు.. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. రాబోయే 3-4 రోజులలో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన ..మిగతా 2లో

## ఎరువులు బ్లాక్ చేస్తే కఠిన చర్యలు

అక్రమంగా తరలిస్తే ఊరుకోం.. రైతుల ప్రయోజనాలను దెబ్బతీయరాదు

కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించం.. మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరికలు

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులను అక్రమంగా పక్కదారి పట్టించడం, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడం, బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, ఇతర ప్రాంతాలకు తరలింపు వంటి వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులకు సరైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందకుండా కొరత సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మంత్రి అచ్చెన్న ఘాటుగా హెచ్చరించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం, పరిశ్రమలకు మళ్లించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే డీలర్లు, మధ్యవర్తులు, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల డీలర్లు, గోదాములు, రవాణా కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీకి మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అక్రమ



నిల్వలు, బ్లాక్ మార్కెట్, అనధికార విక్రయాలు, పరిశ్రమలకు, ఇతర అవసరాలకు ఎరువుల మళ్లింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. 2026-27 సంవత్సరంలో మే 4వ తేదీ నుండి ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అమలు విభాగం చేపట్టిన కఠిన చర్యలను మంత్రి వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల డీలర్లకు 182 షోకాజ్ నోటీసులు జారీ చేశారు, 80 ఎరువుల ..మిగతా 2లో

## జీవీఎంసీకి రూ.1501.03 కోట్లు

3 మెగా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద జాతీయ అపెక్స్ కమిటీ గ్రీన్ సిగ్నల్.

నీటి సరఫరా, యూజీడీ వ్యవస్థల ఆధునీకరణకు పెద్దపీట



(విశాఖపట్నం - జయజయహే)

భారత ప్రభుత్వ గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న “అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రతిపాదించిన మూడు కీలక మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులకు జాతీయ అపెక్స్ ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహో

# ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...




ఆదేశించారు. త్వరలోనే ఈ డ్యాష్ బోర్డు యాక్సెస్‌ను ప్రజలకు కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష మంది వరకు ఉన్న డ్రాపౌట్స్, స్కూళ్లలో ఎన్నడూ నమోదుకాని (నెవర్ ఎన్‌రోల్డ్) పిల్లలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. ఏ ఒక్క బిడ్డ కూడా పొలం పనులకు వెళ్లకుండా, పాఠశాల ముంగిట ఉండేలా ప్రాపర్ ట్రాకింగ్ మెకానిజం ఏర్పాటు చేయాలని, ప్రతి స్కూల్లో కనీసం 10 శాతం అడ్మిషన్లు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. గ్యారంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ని విద్యాశాఖలో ఒక ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ టెక్నాలజీ, క్రోమ్ బుక్స్ అందించబోతున్నామని వెల్లడించారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుల కోసం త్వరలోనే పాల్ , ఏఐ బేస్డ్ లెర్నింగ్, ఏఐ ట్యూటర్ వంటి అధునాతన సాంకేతికతలను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా 'స్టార్ రేటింగ్' విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రి తెలిపారు. ప్రతి పాఠశాలకు లీక్ ప్రూఫ్ బిల్డింగ్, తాగునీరు, టాయిలెట్లు, బెంచీలు కచ్చితంగా ఉండాలని, ఇందుకోసం దాతల సహకారం కూడా తీసుకోవాలన్నారు. కడప మోడల్ తరహాలోనే రాబోయే రెండేళ్లలో రాష్ట్రమంతటా 'స్మార్ట్ కిచెన్' వ్యవస్థను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రు స్కూలును ఇంటర్నేషనల్ స్కూల్‌గా తీర్చిదిద్దడం వల్ల అక్కడ 'నో అడ్మిషన్' బోర్డు పెట్టే పరిస్థితికి చేరుకున్నామని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. అమెరికా కాన్సెప్ట్ తరహాలో ప్రతి జిల్లాలో ఒక పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చాలని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచాలని అధికారులను కోరారు. ఉపాధ్యాయులు కేవలం బోధనపైనే దృష్టి పెట్టేలా, పరిపాలనా బాధ్యతలను అధికారులు చూసుకునేలా సంస్కరణలు తెచ్చామన్నారు. 'లీప్ యాప్' ద్వారా పారదర్శకమైన పనితీరును పర్యవేక్షిస్తామన్నారు. సాంకేతికతతో పాటు సమాజంలో మార్పు కోసం చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతి శనివారం విద్యార్థులకు నైతిక విలువలు, జెండర్ సెన్సిటివిటీ బోధిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల డీఈవోలతో మంత్రి క్షేత్రస్థాయి సమీక్ష జరిపారు. విశాఖ జిల్లాలో అత్యధికంగా 12 శాతం డ్రాపౌట్స్ ఉండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, అర్బన్ అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్ జేడీ, డీఈవోలను ఆదేశించారు. కృష్ణా జిల్లాలోని పెనమలూరు, గుడివాడ, మచిలీపట్నంలో ఉపాధ్యాయ ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉన్న ప్రాంతాలపై నిఘా పెట్టాలన్నారు. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల సాధనలో శ్రీకాకుళం 14వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరడం, గుంటూరు, కడప, తిరుపతి జిల్లాల్లో విద్యార్థులు భారీగా మార్కులు సాధించడంపై మంత్రి అభినందనలు తెలిపారు. హెచ్ఆర్‌డీ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ, గత రెండేళ్లలో విద్యాశాఖలో ఊహించని సంస్కరణలు వచ్చాయని, ఇప్పుడు ఈ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ (కన్సాలిడేషన్) నిర్దేశిత లక్ష్యాలను నిర్విరామంగా చేరుకుంటామని స్పష్టం చేశారు.




## క్లీన్ ఎనర్జీ క్యాపిటల్ రాయలసీమ

(అమరావతి - జయజయహే)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన వివరాలు ఇప్పుడు రాష్ట్ర పారిశ్రామిక వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేలా ఎస్ ఏఈఎల్ సంస్థ చేపట్టిన భారీ సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రాయలసీమ ప్రాంతంలో ఎస్ ఏ ఈ ఎల్ సంస్థ నిర్మించిన 600 మెగావాట్ల భారీ సోలార్ ప్రాజెక్టును మే 22న ప్రారంభించబోతున్నారు. సుమారు రూ. 3,000 కోట్ల భారీ పెట్టుబడితో చేపట్టిన ఈ ప్రాజెక్టును కేవలం 11 నెలల రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఈ విషయాన్ని మంత్రి లోకేష్ తన ట్వీట్ ద్వారా వెల్లడించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ రీ-ట్వీట్ చేశారు. సాధారణంగా ఇటువంటి భారీ స్థాయి ప్రాజెక్టులు పూర్తి కావడానికి ఏళ్ల సమయం పడుతుంది. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక అనుమతుల్లో వేగం పెంచడంతో ఈ ప్రాజెక్టు కేవలం 11 నెలల్లోనే గ్రౌండ్ లెవల్ నుంచి గ్రిడ్ కనెక్టివిటీ వరకు సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం మా రాష్ట్ర పనితీరు వేగానికి, పారిశ్రామికవేత్తల్లో ఉన్న విశ్వాసానికి, అమలు సామర్థ్యానికి నిదర్శనం అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం వల్లే ఇది సాధ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశ క్లీన్ ఎనర్జీ క్యాపిటల్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాబోయే కొన్నేళ్లలో గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏకంగా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఎల్ ఏ ఈ ఎల్ ప్రాజెక్టు ప్రారంభం అనేది ఈ భారీ లక్ష్యం దిశగా పడిన మొదటి బలమైన అడుగుగా రాజకీయ, పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి. వెనుకబడిన ప్రాంతంగా భావించే రాయలసీమకు ఈ ప్రాజెక్టు ఒక వరంగా మారనుంది. 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ద్వారా స్థానిక గ్రిడ్‌కు బలం చేకూరడమే కాకుండా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. సోలార్ ప్యానెళ్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల పర్యావరణానికి మేలు జరగడంతో పాటు, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ లభ్యత పెరగనుంది.

## జీవీఎంసీకి రూ.1501.03 కోట్లు

మొదటి పేజీ తరువాయి...

కమిటీ ఆమోదం లభించిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. మొత్తం రూ.1501.03 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ మూడు ప్రాజెక్టులు విశాఖ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అమోదించబడినవని కమిషనర్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రతిపాదించిన ప్రాజెక్టులలో మధురవాడ జోన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి ప్రాజెక్టు -- రూ.658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో 24ఇ7 స్మార్ట్ వాటర్ సప్లై సిస్టమ్ అభివృద్ధి ప్రాజెక్టు -- రూ.725.18 కోట్లు, బల్క్ మరియు సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ పునరుద్ధరణ మరియు ఆధునీకరణ ప్రాజెక్టు -- రూ.117.24 కోట్లు తో జీవీఎంసీకి ఆమోదం లభించిందన్నారు. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా విశాఖ నగరంలో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, ఆధునిక పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత లభిస్తుందని కమిషనర్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల అమలుకు అంతర్జాతీయ మరియు జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా రుణ సదుపాయాలు సమీకరించనున్నట్లు ఆయన తెలిపారు. మధురవాడ యూజీడీ ప్రాజెక్టుకు ఐఎఫ్ సీ టర్మ్ లోన్, 24ఇ7 స్మార్ట్ వాటర్ సిస్టమ్‌కు కెనరా బ్యాంకు రుణ సహాయం, బల్క్ వాటర్ సప్లై వ్యవస్థ ఆధునీకరణకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రుణ సహాయం అందనున్నట్లు పేర్కొన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థల్లో సంస్కరణలు, మార్కెట్ ఆధారిత పెట్టుబడులు, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, జీవీఎంసీ కూడా అదే దిశగా సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతోందని కమిషనర్ తెలిపారు. ఈ ప్రాజెక్టులు అమల్లోకి రావడం ద్వారా విశాఖ నగరంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నిరంతర తాగునీటి సరఫరా, ఆధునిక మురుగునీటి నిర్వహణ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పాటు నగర అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని జీవీఎంసీ కమిషనర్ పేర్కొన్నారు.

## కుల గణన జరగాల్సిందే..

మొదటి పేజీ తరువాయి...

సేకరించడం వల్ల సామాజిక, రాజకీయ సమస్యలు తలెత్తుతాయని, కార్పొరేట్ సంస్థలు కూడా ఈ డేటాను తమ స్వార్థం కోసం వాడుకుంటాయని తన వాదనలో పేర్కొన్నారు. అయితే, ఈ వాదనతో కోర్టు ఏకీభవించలేదు. వెనుకబడిన తరగతుల కూర్పును, వారి జనాభా విస్తృతిని నిర్ణయించడానికి ప్రభుత్వానికి ఇటువంటి డేటా చట్టబద్ధంగా అవసరమని కోర్టు పేర్కొంది. కుల గణనను 2027 జనాభా గణనలో చేర్చాలా వద్దా అనేది నిర్ణయించడం కోర్టు పరిధిలోకి రాదని సిజెఐ పేర్కొన్నారు. ఎవరెవరు వెనుకబడి ఉన్నారో తెలిసినప్పుడే ప్రభుత్వం సరైన సంక్షేమ పథకాలు రూపొందించగలదని ధర్మాసనం అభిప్రాయపడింది. సెన్సస్ లో కుల గణనను చేర్చాలన్న డిమాండ్ గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. అనేక రాజకీయ పార్టీలు కుల గణన కోసం పట్టుబడుతుండగా, సుప్రీంకోర్టు తాజా తీర్పు ఆ వాదనలకు బలాన్ని ఇచ్చింది. కుల గణన డేటా వల్ల రిజర్వేషన్లు, విద్య, ఉపాధి వంటి రంగాల్లో వెనుకబడిన వర్గాలకు మరింత న్యాయం జరుగుతుందని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.సుప్రీంకోర్టు తీర్పుతో కుల గణనపై నెలకొన్న న్యాయపరమైన చిక్కులు తొలగిపోయినట్లయ్యింది.

## లంచగొండులను పట్టిస్తే రూ. లక్ష బహుమతి

మొదటి పేజీ తరువాయి...

మొబైల్ యాప్ ను అందుబాటులోకి తెచ్చింది. సామా న్య ప్రజలు ఇకపై అధికారుల వేధింపులకు భయపడాల్సిన అవసరం లేదని, మీ స్మార్ట్‌ఫోనే మీ ఆయుధమని సీఎం స్పష్టం చేశారు. ఈ పథకం అమలు తీరు అత్యంత పారదర్శకంగా ఉండనుంది. లంచం అడుగుతున్న వీడియోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక ప్రత్యేక స్క్రీనింగ్ కమిటీ 24 గంటల్లోపు ఆ వీడియో వాస్తవికతను పరీక్షిస్తుంది. వీడియో నిజమని తేలితే, ఫిర్యాదు చేసిన పౌరుడికి వెంటనే రూ. 1 లక్ష రివార్డు అందజేస్తారు. లంచం అడిగిన ఉద్యోగిని తక్షణమే సస్పెండ్ చేసి, కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవకులు, యజమానులు కాదు" అనే నినాదంతో విజయ్ ఈ పథకాన్ని రూపొందించారు. కేవలం రూ.100 లేదా రూ.500 లంచం అడగాలన్నా అధికారులు వణికిపోయేలా ఈ నిబంధనలు ఉండనున్నాయి. ప్రతి పౌరుడిని ఒక ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్‌గా మార్చడం ద్వారా పాలనలో జవాబుదారీతనం తీసుకురావడమే లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాన్ని ఆసరాగా చేసుకుని కక్షపూరిత ఫిర్యాదులు లేదా ఫేక్ వీడియోలు చేసే వారిపై కూడా ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. స్క్రీనింగ్ కమిటీ వీడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి మార్ఫింగ్ చేసిన వీడియోలను గుర్తిస్తుంది. తప్పుడు ఫిర్యాదులు చేసే వారిపై తిరుగుటపాలో కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ నిర్ణయం తమిళనాట యువతలో విపరీతమైన జోష్ నింపుతోంది. సామాన్యుడికి ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని కలిగించడంలో విజయ్ తొలి అడుగులోనే సక్సెస్ అయ్యారని భావిస్తున్నారు

## నిప్పుల కుంపటి

మొదటి పేజీ తరువాయి...

భాగాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 4.5 కి.మీ. ఎత్తులో, ఆగ్నేయ అరేబియా సముద్రం నుండి లక్షద్వీప్, ఉత్తర కేరళ, దక్షిణ అంతర్గత కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు ఒక ద్రోణి విస్తరించి ఉంది. అల్పపీడన ద్రోణి ఇప్పుడు తూర్పు ఉత్తరప్రదేశ్‌పై ఉన్న ఆవర్తనం నుండి ప్రారంభమై, తూర్పు మధ్యప్రదేశ్ -- విదర్భల మీదుగా ఉత్తర ఉత్తరప్రదేశ్‌లోని మధ్య భాగాల నుండి ఉత్తర తెలంగాణ వరకు, సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి ఉంది. నిన్న దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలపై, సగటు సముద్ర మట్టానికి 3.1 బుధవారం, గురువారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు, 40 నుండి 50 కి మీ వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఈరోజు, రేపు -- ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని ఉత్తర జిల్లాలలో వడగాల్పులు వీచే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ -- యానాం: బుధవారం, గురువారం, శుక్రవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గరిష్టముగా గంటకు 50-60 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

## ఎరువులు బ్లాక్ చేస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి...

లైసెన్సులను సస్పెండ్ చేశారు, 1 ఎరువుల లైసెన్సును రద్దు చేశారు. సెక్షన్ 6-ఏ కింద 1 కేసు నమోదు చేశారు, రూ.707 లక్షల విలువైన 3372 మెట్రిక్ టన్నుల ఎరువులను నిర్బంధించారు. రూ.5 లక్షల విలువైన 2 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, రైతులకు అందకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్న హెచ్చరించారు. ఎరువులను పక్కదారి పట్టించినట్లు రుజువైతే సంబంధిత డీలర్ల లైసెన్సులు వెంటనే రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ వ్యవహారాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యవసాయ శాఖ అధికారులపైనా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒకే జిల్లాలో సంబంధిత అధికారుల పరిధిలో ఎరువుల అమ్మకాల్లో పునరావృతంగా అవకతవకలు, నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూస్తే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

### 59 ఏళ్ల తర్వాత తమిళ

## క్యాబినెట్‌లోకి కాంగ్రెస్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దాదాపు 59 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు మంత్రివర్గంలోకి అడుగుపెడుతోంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం గురువారంనాడు మంత్రివర్గ విస్తరణ సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్‌లు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలియజేశారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో పార్టీ ఎమ్మెల్యేలు అడ్వకేట్ రాజేష్ కుమార్, పి.విశ్వనాథ్‌లు విజయ్ సారథ్యంలోని తమిళనాడు క్యాబినెట్‌లో మంత్రులుగా గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇది మాకు ఒక చారిత్రక సందర్భం. 59 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు క్యాబినెట్‌లో చేరుతోంది. ప్రభుత్వంలో చేరుతున్న మా ఎమ్మెల్యేలు ఇద్దరికీ అభినందనలు. తమిళనాడు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్దేశించిన సంక్షేమ, ప్రజానుకూల ప్రభుత్వ విజన్‌ను సాకారం చేస్తారని ఆశిస్తున్నాం' అని ఆ పోస్టులో కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. సుదీర్ఘ కాలంగా డీఎంకేతో పొత్తు సాగించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కాకుండా పరోక్షంగా మద్దతు కొనసాగిస్తూ వచ్చింది. ఇటీవల ఎన్నికల అనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో డీఎంకే పార్టీతో పొత్తుకు ఉద్వాసన చెప్పి విజయ్ టీవీకే ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆ పార్టీతో జతకట్టింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు గాను టీవీకే 118 స్థానాల్లో గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు 10 సీట్లు తగ్గడంతో పొత్తులకు తెరతీసింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, వీసీకేలు విజయ్‌కు మద్దతు ప్రకటించడంతో విజయ్ ముఖ్యమంత్రిగా మే 10న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది క్యాబినెట్‌లో చేరారు.

## అతి అభినయం!

మొదటి పేజీ తరువాయి...

రాజకీయ ప్రయోజనం పొందాలని చూశారన్నారు. అల్లూరి జిల్లాలో కొంతకాలంగా పాస్టర్లతో సమావేశాలు నిర్వహించారని రాజకీయ పార్టీ ఏర్పాటుపైనా చర్చలు జరిపారని చెప్పారు. ఈ ఘటనలో మట్నత్తం 9 మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితుల్లో ఒకరు మైనర్ ఉన్నారన్నారు. అతి అభినయంతో దాడి డ్రామా ఆడి పాడేరు ఘటనలో అడ్డంగా బుక్ అయిన పాస్టర్ అభినయ్ దర్శన్ గురించి విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గంలో తనపై తానే దాడి చేయించుకుని డ్రామా ఆడి, లేని పోని రచ్చకు తెర లేపిన పాస్టర్ అభినయ్ డ్రామా ఎపిసోడ్ వెనుకున్న కుట్రను ఛేదించే క్రమంలో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తులో భాగంగా పాస్టర్ అభినయ్ బాగోతాలు తవ్వుతున్న కొద్దీ బయటపడుతున్నాయి. అతనిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లల్లో నమోదైన కేసులు, విలాసాల కోసం అభినయ్ చేసిన అభినయాలు ఇప్పుడు తెర మీదకు వచ్చాయి. పాస్టర్ ముసుగులో పలువురు మహిళలను మోసం చేయడం, అదనపు కట్నం కోసం వేధింపులకు భార్యను వేధించడం వంటి ఘటనల్లో కడపకు చెందిన అభినయ్ దర్శన్ పలు పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వివాహేతర సంబంధాలు పెట్టుకుంటూ, మొదటి భార్యకు తెలియకుండా ఏకకాలంలో పలువురు మహిళలను పెళ్లాడిన ఈ అభినయ దర్శన్ వెనుకున్న బాగోతాలు బయటపడుతున్నాయి. కడప నగరంలోని ఎర్రముక్కపల్లి (కందిపాలెం), ప్రస్తుతం ప్రకాష్ నగర్‌కు చెందిన అభినయ్ దర్శన్ ఎస్వీ యూనివర్సిటీ నుంచి యానిమేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందాడు. 2011 మే 19న ప్రకాష్ నగర్‌కు చెందిన ఓ యువతితో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.1,50,000 నగదు, 15 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. అభినయ్‌కు కుమార్తెలు ఉన్నారు. అభినయ్ భార్యకు యూనియన్ బ్యాంకులో క్యాషియర్‌గా ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లోని మణికొండకు బదిలీ అయ్యారు. ఆ సమయంలో అభినయ్ దర్శన్ తనకు సినిమాల్లో అవకాశాలు వస్తాయంటూ భార్యను తీవ్రంగా ఒత్తిడి చేసి, ఆమె పేరుతో భారీగా అప్పులు, తీసుకున్నాడు. ఆ డబ్బును భార్య అనుమతి లేకుండా హైదరాబాద్‌లో తన వ్యక్తిగత విలాసాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ, భార్యను అప్పుల ఊబిలోకి నెట్టాడు. హైదరాబాద్‌లో ఐదేళ్ల ముగిసిన తర్వాత బ్యాంకు ఉద్యోగిగా ఉన్న భార్యకు బదిలీ కావడంతో కడపకు వచ్చారు. ఈ క్రమంలో తాను మారిపోయానని, ఇకపై పాస్టర్‌గా సేవలు చేసుకుంటానని నమ్మించి, కడపలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ద్వారా భార్యతో మళ్లీ భారీగా లోన్లు తీసుకున్నాడు. భర్తను నమ్మి ఆర్థికంగా అండగా నిలవడంతో ఆయన విజయనగరం, రాజమండ్రి, అనకాపల్లి, పాడేరు ఏజెన్సీ ప్రాంతాలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో స్వతంత్ర పాస్టర్‌గా సేవలు ప్రారంభించాడు. అయితే విజయనగరంలో పాస్టర్‌గా ఉన్న సమయంలో ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని, 2021 మే 15న ఆమెను తీసుకుని పారిపోయి రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. దీనిపై ఆ యువతి తల్లిదండ్రులు విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో మొదటి భార్యను సంప్రదించగా అభినయ్ దర్శన్ బుద్ధి మంచిది కాదని, అంతకుముందే విజయవాడలో మరో మహిళను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని, పెద్దలు, పోలీసుల జోక్యంతో విడిపోయారని అసలు విషయాలు బయటపెట్టింది. మొదటి భార్య తన గుట్టు రట్టు చేసిందని తెలుసుకున్న అభినయ్ దర్శన్, విజయనగరం యువతి తల్లిదండ్రులను ఫోన్లు చేసి చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. అంతేకాకుండా 2021 మే నెలలో విజయనగరంలోని వారి అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. గేటుకు తాళం వేసి ఉండటంతో తీవ్రమైన బూతులు తిడుతూ, ఇనుప రాడ్డుతో గేటును కొడుతూ న్యూసెన్స్ సృష్టించాడు. దీంతో విజయనగరం వన్‌టౌన్ పోలీసులు ఇతనిపై క్రైమ్ నెం. 331/2021 ఖ/ం 506, 509 ఖ్రాజ కింద కేసు నమోదు చేశారు. ఇటు కడపలోనూ భర్త ప్రవర్తన మారకపోవడంతో మొదటి భార్య కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అభినయ్ దర్శన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై క్రైమ్ నెం. 172/2021 ఖ/ం 498-ఏ, 494 ఖ్రాజ, సెక్షన్ 3, 4 వరకట్న నిషేధ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులు ప్రస్తుతం కోర్టు పరిధిలో విచారణలో ఉన్నాయి. అభినయ్ దర్శన్ భరోసా పార్టీ అనే సంస్థకు వ్యవస్థాపకుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తూ, అభినయ్ దర్శన్ ఫౌండేషన్స్ నడుపుతున్నాడు. ప్రస్తుతం చేంజ్ పీపుల్స్ ఫ్యూచర్ అనే పార్టీ రిజిస్ట్రేషన్ కోసం క్రైస్తవుల నుంచి తలా రూ.10 విరాళం ఇవ్వాలంటూ సోషల్ మీడియా వేదికగా తన బ్యాంక్ ఖాతా వివరాలను షేర్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఇటీవల పాడేరు ఏజెన్సీ పరిధిలో పాదయాత్ర చేపట్టి, అభినయ్ మహారాజ్ అనే పేరుతో సోషల్ మీడియాలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వీడియోలు అప్‌లోడ్ చేస్తూ హడావుడి చేస్తున్నాడు. కాగా, మే 18న జీ.కే వీధి మండలం మొండిగెడ్డ వద్ద నలుగురు ముసుగు దొంగలు తనపై దాడి చేశారంటూ స్వల్ప గాయాలతో చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చేరి నాటకీయ పరిణామాలకు తెరలేపాడు. పాస్టర్ వృత్తిని, సామాజిక సేవను అడ్డం పెట్టుకుని బహుభార్యాత్వానికి పాల్పడుతూ, మహిళల జీవితాలతో ఆడుకుంటున్న ఈ కిలాడి పాస్టర్ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలతో పోలీసులు మరింత లోతైన దర్యాప్తు చేపడుతున్నారు. రాష్ట్రంలో లేని పోని అశాంతిని క్రియేట్ చేసేందుకు ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు ఓ పార్టీకి చెందిన కొందరు నేతలు పని గట్టుకుని కుట్రలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేసుకుని కుట్రలకు తెర లేపుతున్నారు. ఈ క్రమంలో పాడేరులో తనపై తానే దాడి చేసుకున్న పాస్టర్ అభినయ్ వెనుకున్న రాజకీయ కుట్రల కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో పాటు పాస్టర్ అభినయ్‌కు ఉన్న కడప లింకుల పైనా ఆరా తీస్తున్నారు. కేవలం పబ్లిసిటీ కోసం పాస్టర్ అభినయ్ ఈ డ్రామా ఆడారా? లేక రాజకీయ కుట్ర కోణం ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం

# ఉమా'స్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం( జయ జయహే)**

విశాఖ నగరంలో సరస్వతి పార్క్ వద్ద నూతనంగా మాజీ కార్పొరేటర్, జనసేన నాయకులు బొదిలపాటి ఉమా మహేశ్వర రావు ఏర్పాటు చేసిన "ఉమా'స్ కన్వెన్షన్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్వాహకులకు ఉమా మహేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించి, నిర్వాహకులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలతో ఇలాంటి కన్వెన్షన్ సెంటర్లు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంలో ఇటువంటి వాణిజ్య సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ





కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే,పెద్దలు డాక్టర్ రెహమాన్ , టీడీపీ జిల్లా అధ్యక్షులు పట్టాభి , ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు, అభిమానులు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు.



## టూరిజం అభివృద్ధిపై మంత్రి కందులతో సోము వీర్రాజు భేటీ

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను రాష్ట్ర శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు బుధవారం వెలగపూడి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి చేయదగిన పర్యాటక ప్రాజెక్టులపై మంత్రి తో విస్తృతంగా చర్చించినట్లు సోము వీర్రాజు తెలిపారు.గోదావరి పరివాహక ప్రాంతం సహజసిద్ధమైన అందాలతో నిండిన ప్రదేశం కావడంతో అక్కడ ఎకో టూరిజం, మెడికల్ టూరిజం వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి విశేష అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సహజ సిద్ధమైన అభయారణ్యాలు, ప్రశాంత వాతావరణం మెడికల్ టూరిజం అభివృద్ధికి ఎంతో అనుకూలంగా ఉంటాయని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మెడికల్ టూరిజం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు.అలాగే పోలవరం ప్రాజెక్టు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను మంత్రి కందుల దుర్గేష్‌కు అందజేసి, వాటిని వేగవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు



### స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే
## చుక్కా పగడాలమ్మకు నివాళి

**నిరాడంబర రాజకీయ ప్రజా జీవితం ఆమె సొంతం**

**టెక్కలి మే 20 జయ జయహే**

స్వచ్ఛమైన రాజకీయ ప్రజా సేవలు కనుమరుగవుతున్న ప్రస్తుత సమాజంలో బాధ్యతగల పౌరులుగా నిస్వార్థ నిరాడంబర గ్రామీణ దళిత మహిళ పేదరిక కుటుంబం నుంచి వచ్చిన స్వర్గీయ చుక్కా పగడాలమ్మ పాతపట్నం ఎమ్మెల్యేగా 1972 నుంచి 1978 లో పనిచేశారు. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల ప్రజల అభివృద్ధి కోసం సేవలు అందించి ప్రజా నాయకురాలుగా ప్రత్యేక ప్రజా పగడాలమ్మగా పేరును తెచ్చుకున్నారని , అప్పట్లో ఓ మారుమూల ప్రాంతం మెలియా పుట్టి మండలం నుంచిఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో శాసనసభకు ఓ పేద దళిత సామాజిక వర్గం కుటుంబం ము క్తాపురం గ్రామం నుంచి పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎంపిక చేయడం భారత రాజ్యాంగం కల్పించిన మహోన్నత అంశమే , ఈ హర్షనీయమైన ఆలోచన అని ఆంధ్రప్రదేశ్ సమతా సైనిక్ దళ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతంలో పేదరికంతో సర్వసాధారణ ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తిత్వం గల మంచి వ్యక్తి మృతి చెందటం దళిత ప్రజలకు బాధాకరమైన విషయం మని పగడాలమ్మ ఆత్మ కు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నామన్నారు, ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలిపినట్లు రామారావు తెలిపారు, ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు పేర నాగేశ్వరరావు, మాధవ్, జి కాళిదాసు, స్వర్గీయ పగ డాలమ్మ కుటుంబ సభ్యులు అలికాన మాధవరావు, జయప్రద, ఆ రియా పల్లి హైమావతి, గోజ్జా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



### ప్రకృతి వ్యవసాయమే
## ప్రజా అభివృద్ధికి నాంది

**వాతావరణాన్ని తట్టుకునే పంటలే అవసరం**

**సాంప్రదాయ సారవంత పంటలపై రైతులకు అవగాహన**

**టెక్కలి మే 20 జయ జయహే**

ప్రకృతి వ్యవసాయమే ప్రజా అభివృద్ధికి భూసారవంతానికి మేలు చేసి పంటల దిగుబడి జరిగి రైతుల ఆర్థిక విధానాలకు మేలు చేస్తుందని ప్రకృతి పంటల జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు. టెక్కలి మండలం భగవాన్ పురం రైతులు , సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు, వాతావరణ పరిస్థితులను తట్టుకు నే వ్యవసాయాలు పై రైతులకు సమగ్ర అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు, నవధాన్యాల సాగు మీద రైతులు దృష్టి పెట్టి కృత్రిమ ఎరువులు వాడకాలను తగ్గించి జీవామృతం కలిగిన ప్రకృతి సాంప్రదాయ ఎ రువులను వినియోగించాలని తెలిపారు. నీటి ఎద్దడిని త ట్టుకొనే ఆముదము, కంది చేను, జొన్నలు, అలసందులు, సజ్జలు, గోరుచిక్కుళ్ళు, అనుములు వంటి నవధాన్యాలను ప్రతి గ్రామంలో తగిన స్థలము కేటాయించి ఈ పంటల సాగుపై రైతులు దృష్టి కేంద్రీకరించాలని ఆయన స్పష్టం చేశారు. సారవంత తమైన భూములు కావాలనుకునేవారు ఎరువుల వాడకం తగ్గించాలన్నారు, ప్రకృతి వ్యవసాయం దేశ ప్రగతికి ఎంతో మేలు చేస్తుందని సత్యనారాయణ స్పష్టం చేశారు, ఈ అవగాహన కార్యక్రమంలో రైతులతోపాటు టెక్కలి ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





## నేడే మరిడిమాంబ పండగ

**బుచ్చయ్యపేట జయ జయహే**

మండలంలోని కరక గ్రామంలో గురువారం శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ అత్యంత ఘనంగా నిర్వహించబడునని ఉత్సవ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ స్థానిక విలేకరులుతో వారు మాట్లాడుతూ ఆలయాన్ని సర్వ సుందరంగా తీర్చిదిద్దామని ఆలయం వద్ద యువకుల సహాయ సహకారాలతో ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించమన్నారు. పండగ రోజు మధ్యాహ్నం నుంచి ముగ్గుల పోటీలు, పిడతల పోటీలు, గుర్రాల పందాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. రాత్రికి డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం, బుర్రకథ, భారీగా విద్యుత్ అలంకరణ, భారీగా మందు గూడు సామాగ్రితో అంగరంగ వైభవంగా మరిడిమాంబ అమ్మవారు పండగ నిర్వహిస్తున్నామని తెలిపారు.

# తైక్వాండో పోటీల్లో విజయనగరం క్రీడాకారుల ప్రభంజనం

**16 గోల్డ్ మెడల్స్‌తో ఘన విజయం**

**విజయనగరం :(జయ జయహే)**

తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా బృందావన్ గార్డెన్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. మే 15, 16, 17 తేదీలలో మూడు రోజుల పాటు జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలలో జిల్లా జట్టు తమ మేటి నైపుణ్యంతో ఏకంగా 16 బంగారు, 9 వెండి, 1 కాంస్య పతకాలను కైవసం చేసుకుని సరికొత్త రికార్డు సృష్టించింది.ఈ పోటీల్లో ఎన్. హర్షిణి, టి. నాగ సాయి జతిన్, వై. ముకేష్ విశ్వనాథ్, వి. రోహిణి సత్యలు అసాధారణ ప్రతిభ కనబరిచి తలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. అలాగే డి. ప్రియవల్లి, డి. కార్తికేయ, ఎస్. గగన్, ఆర్. పూర్ణ చంద్రు, వై. చరిష్మా, టి. సాంకీర్తన, ఎస్. సత్విక్, డి. ధనీష్‌లు ఒక్కో బంగారు పతకాన్ని సాధించి జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో చాటారు. ఎం. భావ్య శ్రీ, పి. సహస్ర సమ్విత, డి. ప్రియవల్లి, ఎ. ముకేష్ మనికంఠ, టి. మేఘనా శ్రీ, ఆర్. తేజ శ్రీ, జి. ఫలక్ కుమార్, జి. తరుణ్, డి. ధనేష్‌లు ప్రతిభ చాటి రజత పతకాలను సొంతం



చేసుకోగా, కాంస్య (బ్రోంజ్) పతకాన్ని ఎస్. సత్విక్ సాధించారు.జాతీయ స్థాయిలో విజయనగరం పేరును మారుమోగించిన క్రీడాకారులను విజయనగరం జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్. వేణుగోపాలరావు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులను ఇంతటి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దిన కోచ్‌లు యశస్విని, చైతన్యల కృషిని వారు కొనియాడారు. విజేతలైన క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.



## గద్యగూడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**అరకులోయ/జయ జయహే.**

మండల కేంద్రంలోని గద్యగూడ గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కొత్తబల్లుగుడ ఎంపీటీసీ స్వాభి లక్ష్మీరామూర్తి కొబ్బరికాయ కొట్టి, శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు.గ్రామంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు జనరల్ ఫండ్ .15వ ఆర్థిక సంఘం నిధుల నుండి సుమారు రూ. 5 లక్షల వ్యయంతో 75 మీటర్ల పొడవైన సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ నిధులతో చేపట్టనున్న పనులను బుధవారం ఎంపీటీసీ లక్ష్మీరామూర్తి అధికారికంగా ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల గద్యగూడ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న ఎంపీటీసీకి వారు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకులోయ మండల అధ్యక్షులు స్వాభి రామ్మూర్తి,కమిడి అశోక్,నాగేష్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు,అర్జున్ సుంకరమెట్ట పంచాయతీ అధ్యక్షులు,దశరథి డుంబ్రిగూడ మండల యూత్ అధ్యక్షుడు,గద్యగూడ గ్రామస్తులు, కాంట్రాక్టర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# విబిజీ రాంజీ పథకం నిధులు లేమితో నిట్టూర్పు

**పేదల పొట్టలు కొడుతున్న వికసిత భారత్ కార్యక్రమం**

**రెండు పూటల పనినీ రద్దు చేయాలి**

**వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**

**టెక్కలి మే 20 జయ జయహే**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేశంలో అమలు పరుస్తున్న విబిజి రాంజీ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజు గా ర్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ పథకాన్ని ఇదివరకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో కొనసాగేది దీన్ని పేరు మార్పిడి చేసి వి బి జి రాంజీ పథకంగా గ్రామ ప్రాంతాల్లో పనులు చేస్తున్నారని అయితే



నిధుల లేమితో ఈ పథకం గ్రామీణ స్థాయిలో నత్తనడక లో కొనసాగుతోందని వ్యవసాయ కార్మిక సంఘం శ్రీకాకుళం జిల్లా సహాయక కార్యదర్శి కొల్లి ఎల్లయ్య తెలిపారు. ఈ మేరకు టెక్కలి మండలం రావివలస గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. బిజెపి ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప కార్మికులకు కల్పించిన సౌకర్యాలు ఏమి లేవని విమర్శించారు.125 రోజుల పని దినాలు కల్పించినప్పటికీ నిధులు మంజూరు చేయడంలో అలసత్వం కనిపిస్తుందన్నారు, ఉపాధి హామీ పాత బకాయి లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు, పని జరుగుతున్న ప్రాంతాలలో రెండు పూటలా పనిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు, పని స్థలములో మంచినీళ్లు, మజ్జిగ, సౌకర్యాలు కల్పించాలన్నారు, 30 రోజులు పని చేసిన వారికి పనిముట్లు అందించి, ప్రతివారికి ప్రథమ చికిత్స మెడికల్ కిట్స్ పంపిణీ చేయాలన్నారు, ఉపాధి వేతన దారులు ప్రమాదవశాత్తు మరణిస్తే పది లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, అలాగే కార్మికులకు రోజుకు 700 రూపాయలు వేతనాన్ని చెల్లించి ఈ పనుల్లో ఎలాంటి దాపరకాలు , అవినీతి లేకుండా ఆకస్మిక పర్యవేక్షణ జరపాలని, అందరికీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందని ఎల్లయ్య పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రెయ్యి సింహాచలం, పి ట్ట గంగయ్య, జో గ తిరుపతి, సిహెచ్ సుధాకర్, ఏ ప్రకాష్ ఉ పాధి కార్మికులు పాల్గొన్నారు.



## అమ్మ వారి ఆశీస్సులు...
# భక్తులకు సేవే లక్ష్యం...!

### ఎస్కేఎంఎల్ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల నిర్ణయం

**విశాఖపట్నం, మే 20, జయ జయహే**

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సమావేశం బుధవారం జరిగింది. ఆలయ చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులతో తొలి సమావేశంలో అమ్మవారి ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, దేవస్థానం సమగ్ర అభివృద్ధి, అలాగే భక్తులకు నాణ్యమైన అన్నదాన ప్రసాదం అందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి, భక్తులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా దేవస్థానం అభివృద్ధి, పారదర్శక పాలన, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, దేవస్థానం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. భక్తుల సేవే లక్ష్యంగా... అమ్మవారి ఆశీస్సులతో దేవస్థానం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

### యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్లెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమొక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమొక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమొక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# భారతీయ మహిళల సమగ్ర ఎదుగుదలను దెబ్బతీస్తున్న ఆరోగ్య సమస్యలు

(సి.హెచ్.ప్రతాప్)

**భారతీయ మహిళల సమగ్ర ఎదుగుదలను, జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్న శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలలో రక్తహీనత మరియు మానసిక ఆందోళన అత్యంత ప్రధానమైనవిగా కనిపిస్తున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉండి, సమాజంలో మహిళల ఉత్పాదకతను, వారి దైనందిన జీవన సంతోషాన్ని తీవ్రంగా హరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న శారీరక సమస్యలలో రక్తహీనత మొదటి స్థానంలో ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల ప్రకారం, దేశంలోని పదిహేను నుండి నలభై తొమ్మిదేళ్ల మధ్య వయస్సు గల మహిళల్లో సగం కంటే ఎక్కువ మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడం వల్ల శరీర కణజాలాలకు తగినంత ప్రాణవాయువు అందక మహిళలు తీవ్రమైన అలసట, బలహీనత మరియు రోగనిరోధక శక్తి లోపించడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలలో ఈ లోపం వల్ల ప్రసవ సమయంలో రక్తస్రావం కావడం, తక్కువ బరువుతో శిశువులు జన్మించడం వంటి ప్రసూతి సమస్యలు తలెత్తుతున్నాయి. ఆహారంలో ఇనుము, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాల లోపంతో పాటు చిన్న వయసులోనే వివాహాలు, వరుస గర్భధారణలు దీనికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.**



శారీరక బలహీనతలతో పాటు భారతీయ మహిళలను నిశ్శబ్దంగా వేధిస్తున్న మరో పెద్ద సమస్య మానసిక ఆందోళన మరియు కుంగుబాటు. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ మానసిక సమస్యలు దాదాపు రెట్టింపు సంఖ్యలో నమోదవుతున్నాయి. ఆధునిక కాలంలో మహిళలు అటు ఉద్యోగ బాధ్యతలను, ఇటు గృహ నిర్వహణ, పిల్లల పెంపకాన్ని సమానంగా చూసుకోవాల్సి రావడం వల్ల తీవ్రమైన ద్వంద్వ పాత్రల ఒత్తిడికి లోనవుతున్నారు. చాలా కుటుంబాలలో మహిళల మానసిక శ్రమను గుర్తించకపోవడం, భావోద్వేగాలను పంచుకోవడానికి సరైన మద్దతు లభించకపోవడం వల్ల వారిలో నిరంతర భయం, నిద్రలేమి, పనులపై ఆసక్తి కోల్పోవడం మరియు అపరాధ భావన వంటి లక్షణాలు వ్యక్తమవుతున్నాయి. వీటికి తోడు ప్రసవానంతరం మరియు రుతువిరతి సమయాల్లో శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు, కొన్ని సందర్భాల్లో ఎదురయ్యే గృహ హింస కూడా మహిళలను మానసిక వ్యాధుల వైపు నెడుతున్నాయి.



ఈ విపత్కర పరిస్థితులను అధిగమించడానికి తక్షణ మరియు సమగ్రమైన చర్యలు అవసరం. శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మహిళలు తమ ఆహారంలో ఆకుకూరలు, బెల్లం, వేరుశనగలు మరియు విటమిన్ సి అధికంగా ఉండే ఉసిరి, నిమ్మ వంటి పండ్లను చేర్చుకోవాలి. ప్రభుత్వాలు అందిస్తున్న పోషకాహార పథకాలను, ఇనుము మాత్రలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి. అదే సమయంలో మానసిక ఆరోగ్య సమస్యలు అనేవి బలహీనత కాదని, అవి కూడా శారీరక అనారోగ్యం లాంటివేననే అవగాహన కుటుంబాలలో రావాలి. గృహ బాధ్యతలను, పిల్లల సంరక్షణను కుటుంబ సభ్యులందరూ సమానంగా పంచుకోవడం ద్వారా మహిళలపై ఒత్తిడిని గణనీయంగా తగ్గించవచ్చు. తీవ్రమైన ఆందోళన లక్షణాలు కనిపించినప్పుడు సంకోచించకుండా వృత్తిపరమైన కౌన్సిలింగ్ మరియు వైద్య సహాయం తీసుకోవాలి. మహిళల శారీరక, మానసిక ఆరోగ్యం బాగున్నప్పుడే ఒక ఆరోగ్యకరమైన కుటుంబం మరియు సమాజం సాధ్యమవుతాయి.

# వేస్ట్ టు విల్యూ.. తెలంగాణ హరిత సంకల్పం

(సి.హెచ్.ప్రతాప్)

**తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "వార్ ఆన్ వేస్ట్" కార్యక్రమం ప్రస్తుతం రాష్ట్ర పర్యావరణ విధానాల్లో అత్యంత ప్రాధాన్యమైన చర్చగా మారింది. పెరుగుతున్న పట్టణీకరణ, విస్తరిస్తున్న పారిశ్రామిక కార్యకలాపాలు, రోజురోజుకీ అధికమవుతున్న ఘన వ్యర్థాల సమస్య మధ్య ఈ కార్యక్రమం కేవలం శుభ్రత యజ్ఞంగా కాకుండా భవిష్యత్ పట్టణ అభివృద్ధికి మార్గదర్శక నమూనాగా నిలుస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం "వేస్ట్ టు విల్యూ" మరియు "ఎకో టౌన్" భావనలను సమగ్రంగా అమలు చేయాలనే దిశగా అడుగులు వేస్తోంది.**



"వార్ ఆన్ వేస్ట్" కార్యక్రమం ప్రధాన ఉద్దేశం వ్యర్థాలను కేవలం తొలగించాల్సిన సమస్యగా కాకుండా, ఆర్థిక వనరుగా మార్చడమే. ఇందుకోసం మున్సిపల్ వ్యర్థాల సేకరణ, మూలస్థాయిలోనే వర్గీకరణ, పునర్వినియోగం, పునరుత్పత్తి, శక్తి ఉత్పత్తి వంటి దశలను సమన్వయం చేస్తూ సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గృహ వ్యర్థాల నుంచి వ్యవసాయ, పారిశ్రామిక అవశేషాల వరకు ప్రతి పదార్థాన్ని వినియోగంలోకి తీసుకురావడమే "వేస్ట్ టు విల్యూ" సారాంశం. కంపోస్టింగ్ కేంద్రాలు, ప్లాస్టిక్ పునర్వినియోగ యూనిట్లు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఈ కార్యక్రమానికి కేంద్రబిందువులుగా నిలుస్తున్నాయి.

ఈ నేపథ్యంలో జపాన్ సహకారంతో ప్రతిపాదిత "ఎకో టౌన్" ప్రాజెక్టులు తెలంగాణకు అంతర్జాతీయ ప్రమాణాల పట్టణ పర్యావరణ నమూనాలను పరిచయం చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలిచిన జపాన్‌లోని కిటాక్యూషు నగర నమూనాను తెలంగాణ అధ్యయనం చేస్తోంది. ఒకప్పుడు తీవ్రమైన పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొన్న కిటాక్యూషు, సమగ్ర వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగ పరిశ్రమలు, హరిత సాంకేతిక విధానాల ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా మారింది. అదే విధానాన్ని హైదరాబాద్ పరిసరాల్లో అమలు చేయాలనే సంకల్పం తెలంగాణ ప్రభుత్వంలో కనిపిస్తోంది.

రంగారెడ్డి జిల్లా సిద్ధాపూర్ ప్రాంతంలో ప్రతిపాదిత ఎకో టౌన్ ఇందుకు ప్రతీకగా నిలుస్తోంది. సుమారు 86 ఎకరాల విస్తీర్ణంలో వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి, నీటి పునరుద్ధరణ, హరిత శక్తి వినియోగం, పర్యావరణ సాంకేతిక కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందుతున్నాయి. ప్రభుత్వం-ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు అమలైతే పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశం ఉంది.

అయితే ఈ కార్యక్రమాల విజయానికి సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే సరిపోదు. ప్రజల్లో అవగాహన, వ్యర్థాల వర్గీకరణపై బాధ్యతాయుత ప్రవర్తన, స్థానిక సంస్థల సామర్థ్యవృద్ధి కూడా అత్యంత కీలకం. జపాన్ మాదిరి క్రమశిక్షణా సంస్కృతి లేకుండా ఎకో టౌన్ భావన పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వడం కష్టం. అయినప్పటికీ, తెలంగాణ ఈ దిశగా వేస్తున్న అడుగులు భారత పట్టణ పర్యావరణ విధానాల్లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నాయి.



# టిడిపి మహానాడులో 19 తీర్మానాలు

### తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు

### తీర్మానాల కమిటీ సభ్యుడు సోమిరెడ్డి వెల్లడి

రెండు రోజుల పాటు నిర్వహించే మహానాడులో మొత్తం 19 తీర్మానాలు ప్రవేశపెట్టాలని తీర్మానాల కమిటీ నిర్ణయించిందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. వీటిలో తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు ఉంటాయన్నారు. తొలిసారిగా అండమాన్‌కు సంబంధించి ఒక తీర్మానం మహానాడులో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి తీర్మానాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహా పలువురు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న మహానాడు కావడంతో పార్టీ శ్రేణులకు ప్రతిష్టాత్మకంగా మారిందని అన్నారు. ఈ మేరకు మిగతావి ఏపీకి సంబంధించిన తీర్మానాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీపై విమర్శలు గుప్పించారు సోమిరెడ్డి. గత రెండేళ్లుగా ఏపీలో పౌరులందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విధ్వంసానికి మారుపేరుగా గొడ్డలి పార్టీ మారిందని సోమిరెడ్డి మండిపడ్డారు. రెండేళ్లుగా ఏపీ సాధించిన పెట్టుబడులు గతంలో ఎప్పుడూ రాలేదని కొనియాడారు. సీఎం చంద్రబాబు బ్రాండ్, లోకేశ్ కృషి, పవన్ తోడ్పాటు, కేంద్రం మద్దతుతో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులు సాధించామని పేర్కొన్నారు. నెల్లూరులో మహానాడు నిర్వహించలేకపోయామనే బాధ ఉన్నప్పటికీ.. పొదుపు చర్యల కోసం హైబ్రిడ్ విధానం తప్పలేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

# పద్మశ్రీ సిరివెన్నెల స్మృతి వనం శంకుస్థాపన





**అనకాపల్లి (జయ జయహే)**

ప్రముఖ గేయ రచయిత పద్మ శ్రీ సిరి వెన్నెల సీతారామశాస్త్రి 71 జయంతి సందర్భంగా అనకాపల్లి పట్టణం గాంధీ నగరంలో విగ్రహం వద్ద అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు చేతుల మీదుగా సిరివెన్నెల స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. ముందు గా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.. ఈ సందర్భంగా శాసన మండల సభ్యులు నాగబాబు మాట్లాడుతూ సినీ పరిశ్రమలో ఆయనతో మాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, చిత్ర పరిశ్రమలో నేను అన్నయ్య అని పిలిచిన ఏకైక వ్యక్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి అని ఆయన పేరు మీద నిర్మిస్తున్న సిరివెన్నెల స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందని, ఈ ప్రాంతం నుంచి మరొక సీతారామశాస్త్రి రావాలని అన్నారు.. అనంతరం శాసనసభ్యులు కొణతాల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తెలుగు భాషకి వెన్నె తెచ్చిన రచయితగా ఎన్నో ప్రఖ్యాత అవార్డులు అందుకున్న రచయితని, తెలుగు భాష ఉన్నంతవరకు సిరివెన్నెల సీతారామశాస్త్రి పేరు ఈ ప్రాంతంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఈ ప్రాంతానికి గౌరవం తెచ్చిన వ్యక్తిగా వచ్చే జనరేషన్ కి స్ఫూర్తిగా ఈ స్మృతి వనం నిలుస్తుందని అన్నారు.. అనకాపల్లి వాసిగా ఆయనను గౌరవించడం ఆనందం కలిగించిందని అన్నారు.. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొన్నారు



## అంతర్జాలాల్లో నిషేధిత మందులు విక్రయాలు నిలుపు చేయాలంటూ వ్యాపారులు బంద్

**చోడవరం మే 20 జయ జయహే**

దేశవ్యాప్తంగా మందుల షాపుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం చోడవరంలో గల మెడికల్ షాపులు మూసివేసి బందు పాటించారు. ఈ సందర్భంగా స్థానిక ఔషధ వర్తక అధ్యక్షులు పూసర్ల రామారావు మాట్లాడుతూ అంతర్జాలంలో ఔషధ నిషేధిత మందులు విక్రయాలు నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా మందుల దుకాణాల యజమానులంతా నల్ల రిబ్బనలు ధరించి స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు కి , సర్కిల్ ఇన్స్పెక్టర్కు వినతిపత్రం అందజేశారు.




## చోడవరం మండలంలో స్వచ్ఛ పదం ప్రత్యేక కార్యక్రమాలు

**పోడవరం మే 20 జయజయహే**

ప్రభుత్వ ఆదేశాలు మేరకు బుధవారం చోడవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో స్వచ్ఛ పదం ప్రత్యేక పారిశుద్ధ్యం పారిశుద్ధ్యం కార్యక్రమాలు నిర్వహించారు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం మండలశీ లో గల అడ్డూరులో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి మెయిన్ రోడ్డు డ్రెయిన్లు పారిశుధ్య పనులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అర్జున రావు , ఎమ్మెస్ జీవో సత్యనారాయణ పంచాయితీ అభివృద్ధి అధికారి శ్రీనివాసు వివిధ గ్రామాల నుండి వచ్చిన పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



## సురేంద్ర కుటుంబానికి ఉత్తరాంధ్ర సకల కళా సమితి లక్షన్నర ఆర్థిక సాయం

**చోడవరం, మే 20, జయ జయహే**

చోడవరం మండలం , లక్కవరం గ్రామానికి చెందిన కోలాటం గురువు బొడ్డు సురేంద్ర ఇటీవల మృతి చెందారు. అయితే ఆ సమయంలో ఆయన భార్య మౌనిక(21) 8 నెలల గర్భవతి. దీంతో ఉత్తరాంధ్ర లో ఉన్న కోలాటం గురువులు అందరం కలిసి " ఉత్తరాంధ్ర సకలకల సమితి " పేరుతో ఒక గ్రూప్ ని ఏర్పాటు చేసి తమ వంతుగా సురేంద్ర కుటుంబానికి లక్ష యాభై వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. ఈ మొత్తాన్ని చోడవరం సిఐ అప్పలరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ మొత్తంలో దినకార్యమునకు 50,000 రూపాయలు అందించగా, మిగిలిన లక్ష రూపాయలు అతనికి పుట్టే బిడ్డ పేరు మీద బ్యాంకు లో వేయాలని నిర్ణయించుకున్నారు. అయితేసురేంద్ర చనిపోయిన 2 నెలలకు అతనికి పాప పుట్టింది. ఇదే పద్యంలో పాప మనస్విని పేరు మీద 1,00,000 రూపాయలను బ్యాంకు లో వేసి బాండ్ చేశారు.ఈ కార్యక్రమశీలో లక్కవరం మాజీ సర్పంచ్ రమణ, కోలాటం గురువులు ఉత్తరాంధ్ర సకలకల సమితి గ్రూప్ అడ్మిన్ మామిడి దాళినాయుడు గ్రూప్ అధ్యక్షులు కర్రి రాజు , ఉపాధ్యక్షులు గేదెల కరుణాకుమార్ , కార్యదర్శి పట్నారి ప్రసాద్ , సహాయ కార్యదర్శి అయితంశెట్టి జగదీష్ , సెక్రటరీ పంచుకోట వెంకటలక్ష్మి , గ్రూప్ మెంబెర్స్ లోవరాజు , కోటి తదితరులు పాల్గొన్నారు



## కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్‌లో అన్నదానం

**తెనాలి జయ జయహే న్యూస్ ప్రతినిధి:**

గుంటూరు జిల్లా, తెనాలి మండలం కఠెవరం గ్రామం లో ఉన్న కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ లో బుధవారం మద్దె నిహంత్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా వారి తల్లితండ్రులు మద్దె తేజ్ కుమార్ - తేజాశ్రీ, చెల్లెలు హన్విష మరియు కుటుంబ సభ్యుల సహకారంతో , అనాధ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ నందూరి కార్తీక్ మాట్లాడుతూ నిహంత్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా వారి తల్లితండ్రులు, మరియు కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేయడం జరిగిందని, నిహంత్ నాయుడు ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆ దేవుని చల్లని దీవెనలు, ఆశీస్సులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన మద్దె నిహంత్ నాయుడు కుటుంబ సభ్యులందరికి ధన్యవాదములు తెలిపారు. చిల్డ్రన్స్ హోమ్ లో అన్నదానం చేయాలనుకున్న దాతలు 8885333665 నెంబర్ కు సంప్రదించాలని కోరారు, ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సంపద తయారీ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

**మాడుగుల మే 20 జయ జయహే**

మాడుగుల మండలంలో గల వివిధ గ్రామాల్లో అధికారులు బుధవారం తడి చెత్త పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా చింతలూరులో సంపద తయారీ విధానాన్ని పరిశీలించి తడి చెత్త పొడి చెత్త సేకరణ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని రోడ్లపై చెత్తలు వేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఈ ఎండిఓకే అప్పారావు సూచించారు. వీరనారాయణ గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండివో షేక్ హుస్సేన్ గ్రామ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.




## చెరువు పనులు పరిశీలించిన అధికారులు ప్రజాప్రతినిధులు

**మాడుగుల మే 20 జయ జయహే**

వాటర్ షెడ్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మాడుగుల మాదిగ అమ్మవారి ఆలయ సమీపంలో గల పాండవుల చెరువు ఆధునీకరణ పనులను బుధవారం అధికారులు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ప్రధానమంత్రి కృషి సంజయ్ యోజన 2.0లో భాగంగా ఈ పనులు ప్రారంభించారు. 50 లక్షలు తో చేపట్టిన అభివృద్ధి పనులు రానున్న రెండు మాసాలలో పూర్తికానున్నాయని తెలిపారు. ముఖ్యంగా మెట్లు, స్టోన్ ప్యాకింగ్, వాకింగ్ ట్రాక్ వంటి ఇతర పనులు పూర్తవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎండిఓకే అప్పారావు మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు తదితరులు కాంట్రాక్టర్కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ టిడిపి పరిశీలకులు ఏసుదాసు, ఏపీవో మురళీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

### అమ్మవారికి ప్రత్యేక పూజలు సినీనిర్మాత అంబికా కృష్ణ

### స్వాగతం పలికిన దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం (జయ జయహే)**





శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారినిబుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులను తీసుకున్నారు.అమ్మవారిని దర్శించుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే, సినీ నిర్మాత అంబికా కృష్ణ ,చత్తీస్ గడ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ రాయపూర్ చైర్మన్ శ్రీనివాసరావు మద్ది కుటుంబ సభ్యులు ఉన్నారు. శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు, ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు అతిథులను సాదరంగా ఆహ్వానించి వారికి అమ్మవారి దర్శనం చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు .అనంతరం వారికి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు అలాగే ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా అంబికా కృష్ణ మాట్లాడుతూ కోరిన వరాలు ఇచ్చే అమ్మవారు ఆయన శ్రీ కనక మహాలక్ష్మి ఆలయాన్ని దర్శించి ఆమె ఆశీస్సులు తీసుకోవడం చాలా సంతోషంగా ఉ ందన్నారు.విశాఖలో సింహాచలం దేవస్థానం తర్వాత అంత ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రం ఈ అమ్మవారి ఆలయం అని పేర్కొన్నారు.దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు అలాగే ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు చూపించిన అభిమానం మరువలేనిది అని చెప్పారు. ఆలయంలో భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగేలా భక్తులకు మంచి ఏర్పాట్లు చేశారని ప్రశంసించారు.అనంతరం దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూఅమ్మవారి కరుణ కటాక్షాలు ప్రతి ఒక్కరి మీద ఉండాలని ఆయన అభిలాషించారు. అమ్మ వారి ఆశీర్వాదంతో ఆలయ అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ ఈవో శోభారాణి, ఇతర ఆలయ అధికారులు అలాగే ధర్మకర్తల మండలి సభ్యులుఆలయ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టారని వెల్లడించారు. ఈ విషయంలో ప్రభుత్వ తోడ్పాటు కూడా మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శోభా రాణి,దేవస్థానం ఏఈఓ ఆనంద్ కుమార్,ఏఈఓ రాజేంద్రకుమార్ ,పర్యవేక్షకులు ఎం. వెంకటరమణ,టెంపుల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్,ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# సత్యదేవునిహుండీ ఆదాయం లెక్కింపు





**అన్నవరం జయ జయహే**

కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరం సత్యదేవుని హుండీలు లెక్కింపు కార్యక్రమం బుధవారం. నాడు చేపెట్టగా స్వామివారి ఆలయం లో వివద. హుండీలు ద్వారా సుమారు. 2.0.5.15.095.రూపాయలు నగుదు భక్తులు హుండీలు. ద్వారా సమర్పించిన కానుకులు ద్వారా ఆలయ అధికారులు. తెలిపారు. బంగారం. 42. గ్రాములు. వెండి 954.గ్రాములు మరియు వివద దేశాల కరెన్సీసమకూరిందిని గడిచిన. 34.రోజులుకు స్వామివారి హుండీలు ద్వారా భక్తులు సమర్పించినట్టు కార్య నిర్వహణాది కారి సూర్య చక్రధరరావు తెలిపారు. హుండీలు లెక్కి0పు కార్యక్రమంలో పాలక మండిలి సభ్యులు. మరియు సిబ్బంది. సేవకులు తదితరులు పాల్గొన్నారు




## వేసవి వేళ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా
# పలు కాలనీల్లో నీటి పరీక్షలు

**ఇంటింటికీ 'స్వచ్ఛమైన' నీరే లక్ష్యంగా**

**వార్డుల్లో జీవీఎంసీ ల్యాబ్ వాహనం తనిఖీలు..**

**ఎమ్మెల్యే కొణతాల చొరవపై ప్రజాహర్షం**

**అనకాపల్లి (జయ జయహే)**

వేసవి కాలంలో పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు, కూటమి నాయకులు చర్యలు చేపట్టారు . ఈ సందర్భంగా బుధవారం జీవీఎంసీ 82, 83, 84 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాలలో 'మొబైల్ వాటర్ క్వాలిటీ టెస్టింగ్ లాబరేటరీ' వాహనం ద్వారా విస్తృతంగా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ సీఎం రమేష్ ఆదేశాల మేరకు.. నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ సూచనలతో స్థానిక నేతలు, అధికారులు ఈ ఉమ్మడి తనిఖీల్లో పాల్గొ న్నారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ నగర్, వుడ్ పేట, గాంధీనగర్, అంజయ్య కాలనీ, ఏఎంసీ కాలనీ, విజయరామరాజుపేట తదితర కాలనీలలో పర్యటించి, కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఆయా నీటి నమూనాలను అక్కడికక్కడే మొబైల్ ల్యాబ్ వాహనంలోని అత్యాధునిక పరికరాల ద్వారా పరీక్షించారు.ముఖ్యంగా నీటిలో ఉండాల్సిన క్లోరిన్ శాతంతో పాటు టర్బిడిటీ, పి హెచ్ విలువలు, ఫ్లోరైడ్, ఐరన్, నైట్రేట్, అమ్మోనియా,టీడీఎస్, ఆర్సెనిక్ మరియు మైక్రో బయోలాజికల్ వంటి కీలకమైన 10 రకాల పరీక్షలను లాబరేటరీ సిబ్బంది పూర్తి చేశారు. ఈ వేసవి ఎండల్లో ప్రజలకు ఎలాంటి నీటి ద్వారా వచ్చే అంటువ్యాధులు, డయేరియా వంటి రోగాలు సోకకుండా ముందస్తుగా నీటి శుద్ధతను పరీక్షించి సరఫరా చేయాలనే సంకల్పంతో శ్రమిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కు, స్థానిక ప్రజాప్రతినిధులకు వార్డులలోని ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను అగ్రస్థానంలో నిలపాలి

**సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌తో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, మే 20, జయ జయహే**



స్వచ్ఛ సర్వేక్షణ్--2025-26లో విశాఖపట్నాన్ని దేశంలోనే ఉత్తమ పరిశుభ్ర నగరంగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో తన చాంబర్ నందు నిర్వహించిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే కొనసాగుతోందని, విశాఖ నగరం గత కొన్ని సంవత్సరాలుగా పరిశుభ్రతలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తూ వస్తోందని కమిషనర్ తెలిపారు. నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు.ప్రజలు తమ గృహాలలో తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా విభజించి ప్రతిరోజూ జీవీఎంసీ వాహనాలకు అందించాలని, ఇంటి నుండి వెలువడే తడి వ్యర్థాల నుండి ఎరువులు తయారు చేయాలని,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే బృందం నగర ప్రజలను ముఖాముఖిగా కలిసి నగర పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, తరలింపు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ అమూల్యమైన అభిప్రాయాలను మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసి స్వచ్ఛత యాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు.ఈ అంశాలన్నింటిపై సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, విశాఖ నగరానికి దేశస్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంలో సహకరించాలని కమిషనర్ ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను కోరారు.అనంతరం "ది డిజిటల్ వాయిస్ అఫ్ వైజాగ్ " ట్యాగ్‌లైన్‌తో రూపొందించిన "వైజాగ్ సోషల్ మీడియా అసోసియేషన్ " లోగోను కమిషనర్ ఆవిష్కరించి వారిని అభినందించారు. విశాఖ వాసులుగా నగర అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా అవగాహన కార్యక్రమాల్లో జీవీఎంసీకి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన వారిని కోరారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అధికారులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, వివిధ డిజిటల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇళ్ల ముంగిటకే హస్త కళారూపాలు

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**

**రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన షో రూమ్ ఏర్పాటు**

**ఏపీహెచ్డీసీ అధికారులతో సమీక్షలో మంత్రి సవిత**

**తాడేపల్లి/అమరావతి( జయ జయహే)**



లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయడంతో పాటు ఈ కామర్స్, సోషల్ మీడియా వేదికగా కళారూపాలను నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. హస్త కళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పనే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. లేపాక్షి షోరూమ్ లు, హస్తకళా రూపాల విక్రయాలపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హస్తక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) అధికారులతో బుధవారం మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొని, రాష్ట్రంలో నూతన లేపాక్షి షో రూమ్ ల ఏర్పాటుతో పాటు ప్రస్తుతమున్న షో రూమ్ లను వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేసే అంశాలపై మంత్రి సవితకు వివరించారు. మరమ్మతులు పూర్తిచేసుకున్న ఢిల్లీ, కాకినాడ లేపాక్షి షో రూమ్ లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మరమ్మతులు పూర్తి చేసుకున్న లేపాక్షి షో రూమ్ లను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన లేపాక్షి షో రూమ్ ఏర్పాటుకు కేంద్ర విమానయాన శాఖ అంగీకారం తెలిపిందని, త్వరగా ఆ షో రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని లేపాక్షి షో రూమ్ లను నూతన హంగులతో వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కామర్స్ ద్వారా హస్త కళారూపాల అమ్మకాలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికను హస్త కళారూపాల విక్రయాలకు అవకాశంగా వాడుకోవాలన్నారు. నేరుగా వినియోగదారుల ఇళ్లకే కళారూపాలను డోర్ డెలివరీ చేసేలా ఈ కామర్స్ వేదికలను వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే ఆప్కో షో రూమ్ ల ద్వారా చేనేత వస్త్రాలను డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న హస్త కళాకారులకు ఏడాది పాటు ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా హస్త కళారూపాల అమ్మకాలు పెంచేలా అధికారులు ప్రణాళికలు అమలుచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హస్తక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్"
# కార్యక్రమం ప్రారంభం

**పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో పర్యాటక శాఖ అధికారులతో కలిసి స్టేక్ హోల్డర్స్‌తో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ సందర్భంగా "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమాన్ని ప్రారంభించారు.దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దిశానిర్దేశంలో రాష్ట్ర పర్యాటక రంగాన్ని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.పర్యాటక రంగ అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు హోటల్స్, హోమ్ స్టేలు, రవాణా రంగాలకు ఆదాయం పెరుగుతుందని వివరించారు. పర్యాటకులకు ఎయిర్‌పోర్ట్ టు ఎయిర్‌పోర్ట్ ప్యాకేజీలతో సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, వివాహ వేడుకలు, హాలిడే ట్రిప్స్, వినోద యాత్రల కోసం విదేశాలకు వెళ్లే ధోరణిని తగ్గించి, రాష్ట్రంలోని అద్భుతమైన పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయ పర్యాటకాన్ని బలోపేతం చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" పోస్టర్లను పర్యాటక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఇన్‌చార్జ్ ఎండీ పద్మావతి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, ఈడీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిసిన
# జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

**తాడేపల్లి (జయ జయహే)**

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర కుటుంబ సమేతంగా బుధవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర కుటుంబంతో కొద్దిసేపు గడిపారు గిరిజన ప్రాంతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం పైన కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా ఈ సందర్భంగా చర్చించారు. తన కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఎక్కువ సమయం కేటాయించి తమకెంతో ఆనందాన్ని మిగిల్చారని సుభద్ర సంతోషం వ్యక్తం చేశారు.



## గురుదేవ్ శ్రీ రవిశంకర్ ఆశీస్సులు
# పొందిన ఎంపీ సతీష్ బాబు

**అమరావతి -జయ జయహే**

బెంగళూరులో నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీ రవిశంకర్ ఆశీస్సులను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పొందారు. . ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గురుదేవ్ శ్రీ రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం గురుదేవ్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ, గురుదేవ్ ఆశీస్సులు పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మికత మనిషిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజ సేవలో మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.

# జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

## టీడీపీ అధ్యక్షులు పల్లాని కోరిన జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్





**గాజువాక, మే 20, జయ జయహే**

జిల్లా గ్రంథాలయాలు అభివృద్ధికి అవసరమైన తోడ్పాటు అందించాలని గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ కోరారు. బుధవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గాజువాక పరిసర ప్రాంతాల్లో గ్రంథాలయాల పరిస్థితిని వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న గ్రంథాలయాల స్థితిగతులను, వాటి అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలను ఎమ్మెల్యే దృష్టిలో వేశారు. విశాఖపట్నం జిల్లాలోని కీలక ప్రాంతమైన గాజువాకలో, విద్యార్థులు, నిరుద్యోగ యువత విజ్ఞాన సముపార్జన కోసం నూతన వసతులతో కూడిన గ్రంథాలయం జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కనే నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్దంగా ఉందన్నారు. ఈ గ్రంథాలయం స్థానిక శాసనసభ సభ్యులు పల్లా శ్రీనివాస్ ప్రత్యేక చొరవ పర్యవేక్షణలో ఆధునికంగా రూపుదిద్దుకుందని వెల్లడించారు. గాజువాక హై స్కూల్ వద్ద సొంత గ్రంథాలయ భవనం, పెదగంట్యాడ హై స్కూల్ వద్ద సొంత గ్రంథాలయ భవనం, నాతయ్యపాలెంలో సొంత భవనం నిర్మాణం జరిగిందని త్వరలో నే ప్రారంభిస్తామని వివరించారు. పెరుగుతున్న పాఠకుల సంఖ్యకు అనుగుణంగా రూ. 60 లక్షల వ్యయంతో పటిష్టమైన, విశాలమైన భవనాన్ని నిర్మించారన్నారు. విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ వారు చెల్లించ వలసి యున్న లైబ్రేరి సెస్ బకాయిలు సూమారు 218 కోట్ల రూపాయలు బకాయిలను చెల్లించే విధముగా ప్రయత్నించాలని కోరారు. నగరంలో ముఖ్య కేంద్రాల్లో ఏవిధమైన ఖాళీ స్థలం గాని ప్రభుత్వ భవనం గాని ఉంటే జిల్లా కేంద్ర గ్రంథాలయమునకు కేటాయించాలని కోరారు. గాజువాక నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రంథాలయంలో కంప్యూటర్లు, ఉచిత వై ఫై, ఇ-లైబ్రరీ సౌకర్యాలు కల్పించాలని, యువతకు ఉపయోగపడేలా గ్రూప్స్, సివిల్స్, బ్యాంకింగ్ పరీక్షల పుస్తకాలను సరఫరా చేయాలన్నారు. సమాజ వికాసానికి ఎంతో కీలకమైన గ్రంథాలయాల ఆధునీకరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## దబ్బంద టిడ్కో కాలనీ
# సందర్శించిన గంటా

**ఆనందపురం, మే 20:( జయ జయహే)**



ఆనందపురం మండలం దబ్బంద గ్రామంలో నిర్మించిన టిడ్కో గృహాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. కాలనీ ప్రజల సమస్యలను ఆయన అడిగి తీసుకున్నారు. టిడ్కో కాలనీలో 1,920 యూనిట్లు ఉండగా.. సరైన సౌకర్యాలు లేకపోవడంతో కేవలం 10- 15 శాతం మంది నివాసముంటున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద సబ్సిడీ ధరకు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను కేటాయించారు. బ్యాంకులకు ఈ.ఎం.ఐ.లు కట్టలేక, కనీస వసతులు లేని దబ్బంద టిడ్కో ఇళ్లల్లో ఉండలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ.. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు రద్దు చేయాలని కోరారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పార్కు, ఆరోగ్య కేంద్రం, రేషన్ డిపో, ప్రజా రవాణా వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళ్లలో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల మహిళలకు రక్షణ కరువవుతోందని, చెత్తా చెదారం పేరుకుపోవడంతో విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. అలాగే స్మశాన వాటిక నిర్మించాలని విన్నవించారు. త్వరలో జరిగే జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సమావేశంలో టిడ్కో కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన గురించి చర్చించి, పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని గంటా హామీ ఇచ్చారు. అంతకుముందు కాలనీలో టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనుబాబు, డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, టిడ్కో ఎస్.ఈ. రామిరెడ్డి, ఈఈ సుధాకర్, డీఈ రాజేష్, ఏఈ అనూష, సి.ఎల్.టి.సి. దేముడు బాబు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, గండ్రెడ్డి సోమినాయుడు, లొడగల వెంకట్రావు, బలిరెడ్డి మల్లికార్జునరావు, మదపాటి శ్రీను, గండ్రెడ్డి రమేష్, కాళ్ల నగేష్ కుమార్, అప్పలరాము, ఎర్ర రాజు, బోని ప్రసాద్, శివ, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కాబోయే ముఖ్యమంత్రి ఎన్టీఆర్

## కోట్లాదిమంది అభిమానులు, తెలుగు ప్రజల ఆకాంక్ష

## తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

**విశాఖపట్నం: (జయ జయహే)**

సీనియర్ ఎన్టీఆర్ చరిష్మా కలిగి ఉన్న జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ జోశ్యం చెప్పారు. ఇది కేవలం తన ఆకాంక్ష మాత్రమే కాదని.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్ల మంది అభిమానులు, తెలుగు ప్రజల ఆకాంక్ష అని రామ్ అభివర్ణించారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం విశాఖలోని హోటల్ దసపలలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ , తెలుగు శక్తి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వచించిన ఈ పుట్టినరోజు వేడుక వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కాకుండా ఇక ఏ శక్తి కూడా ఆపలేదన్నారు. ఆయన రాజకీయంగా ముందుకు అడుగులు వేస్తే .. తాతకు మించిన మనవడుగా కీర్తి ప్రతిష్టలు సాధిస్తాడు అనడంలో అలాంటి సందేహం లేదన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు సందర్భాన్ని బట్టి రంగులు మార్చే ఊసరవెల్లిలా మారారని.. అయితే జూనియర్ ఎన్టీఆర్ నటించిన ఊసరవెల్లి చిత్రం మళ్ళీ విడుదల కావడం ఆయన రాజకీయ రంగ ప్రవేశానికి ఒక యాదృచ్ఛికమైన సందర్భం అని రామ్ అభిప్రాయపడ్డారు. ఏదేమైనాప్పటికీ తెలుగు దేశం పార్టీ ని స్థాపించిన నందమూరి తారక రామారావు నిజమైన రాజకీయ వారసుడుగా ఈతరం.. యువతరం నాయకుడు ఎన్టీఆర్ నిలిచిపోతారన్నారు. ఎన్టీఆర్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని తెలుగు శక్తి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆశీస్సులు అందిస్తోందన్నారు. ఫిలిం డైరెక్టర్ వి.వంశీ బాబు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ కు ఉన్న క్రేజ్ ఎవరికి లేదని రాబోయే రోజుల్లో యువతరానికి ఒక గొప్ప నాయకుడు కావాలని మనవి చేశారు. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రత్యేక ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే వంశీ కృష్ణ





**విశాఖపట్నం, మే 20, జయ జయహే**

వెలంపేట లక్ష్మీ నగర్ వాసులతో జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రాజెక్ట్ ద్వారా నిర్మించబడనున్న ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులతో సమావేశమై వారి సమస్యలు, సందేహాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మీ నగర్ ప్రాంతంలోని 177 కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపిన విషయం సంతోషకరమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ సహకారంతో ఈ ప్రాజెక్ట్ అమలుకు చర్యలు వేగవంతం అయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణ ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో జోన్-4 కమిషనర్ మల్లయ్య నాయుడు , ఎపిడి పద్మ, జనసేన నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, స్టేట్ డైరెక్టర్ రాము రెడ్డి, జనసేన 35 వార్డు అధ్యక్షులు త్రినాథ్ ,స్థానిక నాయకులు, లబ్ధిదారులు మరియు ప్రాంతీయ ప్రజలు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదంలో
# దద్దమైన ఈతవనం

## సంఘటన స్థలాన్ని సందర్శించిన జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల (జయ జయహే)**

కోరుట్ల మండలం సంగెం కల్లూరు గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఈత చెట్టులు దగ్దమయ్యాయి ఈత వనాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం స్థానిక నాయకులు ముంజ రాజా గౌడ్ గౌడ సంఘ నేతలతో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం వల్ల ఈత వనం దగ్ధమవడం చాలా బాధాకరమైన విషయమని విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాల నాయకులు గౌడ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు



# మందులదుకాణాలు బంద్ సక్సెస్

**జంగారెడ్డిగూడెం- జయ జయహే**

అఖిల భారత్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఔషధ దుకాణాలు బంద్ బుధవారం జంగారెడ్డిగూడెం లో విజయవంతం అయ్యింది.పట్టణం లోని మందుల దుకాణాలన్ని ముసివేశారు.హాస్పిటల్ ళ్ళ లో అనుబంధం గా ఉన్న స్టోర్ లు పని జేశాయి. ఈ సందర్భంగా ఇక్కడి బోసుబొమ్మ కూడలి నుంచి ఆర్టీసీ బస్సు స్టాండ్ వరకువ్యాపారులు నల్ల బ్యాడ్జి లను ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణమెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న చైతన్య కుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం ను చేపట్టారు. ఆన్లైన్ లో విచ్చలవిడిగా మందుల విక్రయాలను అరికట్టాలని, అదే విధంగా అధిక డిస్కౌంట్ ల పేరుతో కార్పొరేట్ సంస్థ ల విక్రయాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా సెక్రటరీ శివ రామకృష్ణ, స్థానిక అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాధా కృష్ణ, సెక్రటరీ ప్రవీణ్, మెడికల్ షాప్ యజమానులు పోతుల గణేష్ కుమార్, కాకి రామకృష్ణ, చిన్ని, ప్రసాద్, చైతన్య, రామకృష్ణ, హర్ష, దిలీప్, బాలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర రవాణా ప్రణాళిక రూపకల్పనపై ఉన్నత సమీక్ష

## అన్ని విభాగాల అధికారులు హాజరు

## కీలక ప్రసంగం చేసిన కలెక్టర్ కిషోర్

**విశాఖపట్నం మే 20, జయ జయ హే**

విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ లో మెట్రో రైల్ ప్రాజెక్టుకు అనుబంధంగా ఏర్పాటు చేయవలసిన సమగ్ర రవాణా ప్రణాళిక రూపకల్పనపై స్టేక్ హోల్డర్స్ తో కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిలో సమావేశం నిర్వహించారు. మెట్రో రైల్ ప్రాజెక్టులు ఏర్పాటులో విశేష అనుభవం కలిగి సిస్ట్రా సంస్థ ప్రతినిధులు 2055 నాటికి విశాఖ రీజన్లో జనాభా పెరుగుదలకు అనుగుణంగా అండర్ పాస్ లు, ఫుటపాత్ లు,సైకిల్ ట్రాక్లు,ట్రాఫిక్ సర్వే, దశలవారీగాఅమలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సిస్ట్రా సంస్థ సమగ్ర రవాణా ప్రణాళికను రూపొందించిందని మే 2025 నాటికి ప్రాథమిక సర్వే పూర్తి చేసిందని ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.తరువాత స్టేక్ హోల్డర్స్ తో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశాల లో పాల్గొని వివరించా మన్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ విశాఖ రీజియన్ లో కీలకపాత్ర వహించే సమగ్ర రవాణా ప్రణాళికలో భాగస్వాములైన జీవీఎంసీ, విఎంఆర్డిఏ పోలీస్ రైల్వే,నేషనల్ హైవేస్, తదితర అధికారులు సలహాలు, సూచనలు,అభ్యంతరాలను వ్రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. సమగ్ర రవాణా ప్రణాళిక విశాఖ రీజియన్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని, భవిష్యత్ తరాల దృష్టిలో ఉంచుకొని రూపొందించే కంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ ద్వారా నగర అభివృద్ధి మరింత సమర్థవంతంగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ,వి ఎం ఆర్ డి ఏ పోలీస్ రవాణా,ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాగులతో బరువు తగ్గించుకోండిలా?



**రాగులని ఫింగర్ మిల్లెట్స్ అని కూడా ఉన్నారు. ఇందులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మిల్లెట్స్ని తీసుకుంటే రక్తంలో చక్కెరస్థాయిలు తగ్గించడం నుంచి బరువు తగ్గడం, గుండె ఆరోగ్యం వరకూ చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. రాగులని మొలకెత్తించి తినడం వల్ల ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. ముఖ్యంగా, ఎముకలు, బ్రెయిన్ డెవలప్‌మెంట్‌లో కూడా హెల్ప్ చేస్తాయి. మొలకెత్తిన రాగులని తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఎవరైనా మిల్లెట్స్‌ని ఆహారంగా తీసుకుంటే వారికి పోషకాలు లభిస్తాయి.**

### మిల్లెట్స్‌లోని పోషకాలు..

మిల్లెట్స్‌లో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇందులో ఫైబర్, కాల్షియం, కార్బోహైడ్రేట్స్, విటమిన్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా ఎండాకాలంలో రాగులు తినడం మంచిది. వీటిలోని శీతలీకరణ గుణం వేసవి తాపాన్ని చల్లబరుస్తుంది. అలాగే ఇది షుగర్ ఉన్నవారికి బెస్ట్ ఫుడ్. దీని వల్ల రక్తంలో చక్కెరని కంట్రోల్ చేయడం సాధ్యమవుతుంది.

### రాగి జావ స్పెషల్

### బ్లడ్ షుగర్ లెవల్స్..

షుగర్ ఉన్నవారికి రాగుల మొలకలు ఓ వరమనం చెప్పొచ్చు. ఇందులో పాలిఫెనాల్స్, డైటరీ ఫైబర్ కంటెంట్ ఉంటుంది. కాబట్టి, ఇది షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేయడంలో మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. రాగుల్లోని పీచు రక్తంలో చక్కెర శోషణని నెమ్మదిస్తుంది. దీంతో చక్కెర స్థాయిలు కంట్రోల్ అవుతాయి. కాబట్టి, కచ్చితంగా షుగర్ ఉన్నవారు రాగి మొలకల్ని తింటే షుగర్ కంట్రోల్ అవుతుంది.

### బరువు తగ్గడం..

మొలకెత్తిన రాగుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది వెయిట్‌లాస్‌కి మేలు చేస్తుంది. ఈ మొలకలు తీసుకోవడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. దీంతో కేలరీలని తగ్గిస్తాం. అతిగా తినరు. దీంతో బరువు తగ్గుతారు. పోషకాలు కూడా శరీరానికి అందుతాయి.

### రక్తహీనత దూరం..

మొలకెత్తిన రాగుల్ని తీసుకుంటే రక్తహీనత సమస్య దూరమవుతుంది. రాగుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచడంలో సాయపడుతుంది. మిల్లెట్స్‌ని ఆహారంలో చేర్చుకోవచ్చు. రక్త ప్రసరణ పెరుగుతుంది. దీంతో పాటు ఐరెన్ లెవల్స్ పెరిగి రక్తహీనత దూరమవుతుంది. ఇది మీ బాడీని హెల్దీగా, శక్తివంతంగా చేస్తుంది.

### కొలెస్ట్రాల్ తగ్గడం..

హై కొలెస్ట్రాల్ స్థాయిలను కంట్రోల్ చేయడంలో స్ప్రౌటెడ్ మిల్లెట్స్ చాలా బాగా పనిచేస్తాయి. రెగ్యులర్‌గా రాగుల మొలకల్ని తీసుకుంటే కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది. ఎందుకంటే, ఇందులో అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి లివర్ ఫ్యాట్‌ని తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. అమైనో యాసిడ్స్ కొలెస్ట్రాల్‌ని కంట్రోల్ చేయడంలో సాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



**మిల్లెట్స్ స్మూతీ..**

**పోషకాలు, రిఫ్రెష్ స్మూతీ కోసం మొలకెత్తిన రాగులని ఇష్టమైన పండ్లు, పెరుగు, కొద్దిగా తేనెతో కలిపి స్మూతీలా చేసుకుని తాగండి.**

**సలాడ్ : మొలకెత్తిన మిల్లెట్స్‌ని తాజా కూరగాయలు, ఆకుకూరలతో కలపి హెల్దీ సలాడ్‌లా తయారుచేసుకోవచ్చు.**

**ఇడ్లీ దోశ : వీటితో చక్కగా ఇడ్లీ, దోశల్లా తయారు చేసుకుని తినొచ్చు. దీని వల్ల మిల్లెట్స్‌లోని హెల్దీ బెనిఫిట్స్ అందుతాయి.**

### జీర్ణక్రియకి మేలు..

ఎండాకాలంలో జీర్ణవ్యవస్థ మందగించి గ్యాస్, అసిడిటీ, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. వేయించిన ఆహార పదార్థాలు, హెవీ ఫుడ్ తీసుకున్న తర్వాత గ్యాస్, అసిడిటీ, కడుపునొప్పి సమస్యలొస్తాయి. దీనికోసం మీరు బ్రేక్‌ఫాస్ట్‌లో మొలకెత్తిన మిల్లెట్స్ తీసుకుంటే జీర్ణవ్యవస్థ బలోపేతం అవుతుంది. దీని వల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. రాగి మొలకల్లో ఎక్కువ ఫైబర్ కంటెంట్ ఉంటుంది. ఇది జీర్ణక్రియని ప్రోత్సహించి జీర్ణ సమస్యల్ని దూరం చేస్తుంది.

### ఎలా వాడొచ్చు..

మీ డైట్‌లో మొలకెత్తిన రాగులని వాడడం చాలా ఈజీ. దీనిని సలాడ్స్, స్మూతీల్లా చేసుకోవచ్చు. బ్రేక్‌పాస్ట్‌లో యాడ్ చేయొచ్చు.

### గంజి..

ఈ మొలకల్ని మీరు నీరు, పాలతో ఉడికించి పంచదార, చిటికెడు ఉప్పు కలిపి తీసుకోవచ్చు. మీకు ఇష్టమైతే పండ్లు, డ్రై ఫ్రూట్స్ యాడ్ చేయొచ్చు.



## కివీ పండుతో

# ఆరు ఆరోగ్య ప్రయోజనాలు

పండ్లు, కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో మన శరీరానికి కావాల్సిన విటమిన్‌లు, ఖనిజాలు, ఫైబర్‌లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండ్లలో కివీ పండు కూడా ఒకటి. ఈ పండును తరచూ మన డైట్‌లో భాగం చేసుకోవడం ద్వారా చర్మ సంరక్షణ నుంచి వ్యాధినిరోధకత వరకు ఆరు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మరి ఆ ప్రయోనాలేమిటో చూద్దాం..
తరచూ కివీ పండును తింటే..
ఈ ఆరు ఆరోగ్య ప్రయోజనాలు మీ వెంటే..!

### 1. నాజూకైన చర్మం

కివీ పండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ సి చర్మాన్ని ఆరోగ్యంగా, నాజూకుగా ఉంచుతుంది. వంద గ్రాముల కివీ పండు తింటే ఒక రోజులో దేహానికి అవసరమైన సి విటమిన్‌లో అధిక శాతం లభిస్తుంది. అంతేగాక కివీ పండులో యాంటీ ఆక్సిడెంట్స్ ఉండి చర్మం పాలిపోకుండా, ముడుతలు పడకుండా కాపాడుతుంది. పచ్చి కివీ ముక్కలు తినడం ద్వారా గానీ, లేదంటే నేరుగా చర్మానికి రాసుకోవడం ద్వారా గానీ ఈ ప్రయోజనాన్ని పొందవచ్చు.

### 2. అదుపులోకి బ్లడ్ ప్రెషర్

ప్రస్తుతం ఈ భూమ్మీద లక్షలాది మంది ప్రజలు అధిక రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారు. వారికి కివీ ఫ్రూట్ ఒక వరం లాంటిది. ఎందుకంటే కివీ పండులో పొటాషియం కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఈ పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచడానికి తోడ్పడుతుంది. అంతేగాక రక్తపోటు కారణంగా వచ్చే పక్షవాతం, టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### 3. జీర్ణశక్తి పెరుగుదల

కివీ పండు జీర్ణశక్తికి కూడా బాగా పనిచేస్తుంది. ప్రతి 100 గ్రాముల కివీ పండులో 3 గ్రాముల ఫైబర్ ఉంటుంది. అంతేగాక ప్రతిరోజూ మానవ శరీరానికి అవసరమైన ఫైబర్‌లో 12 శాతం అందుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఫైబర్‌లు సునాయాసమైన, ఆరోగ్యకరమైన జీర్ణశక్తికి దోహదం చేస్తాయి. కివీ పండులో ఎంజైమ్‌లను కరిగించే ప్రొటీన్ ఉంటుంది. దాంతో ఎంజైమ్‌లు అత్యంత వేగంగా అమైనో ఆసిడ్స్‌గా మారుతాయి.

### 4. ఆరోగ్యకరమైన నిద్ర

కివీ పండులో సెరటోనిన్ వంటి నిద్రకు ఉపకరించే పదార్థాలు ఉన్నాయి. అందువల్ల తరచూ కివీ పండు తినేవారికి హాయిగా నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఈ పండు మంచి మేలు చేస్తుంది. కివీ పండులోని పదార్థాలు సహజసిద్ధమైన నిద్రకు తోడ్పడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

### 5. రోగనిరోధక శక్తి పెంపు

ముందే చెప్పుకున్నట్టుగా సి విటమిన్‌కు కివీ పండు ఒక మంచి వనరుగా ఉంటుంది. ఈ విటమిన్ రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కూడా బాగా పనిచేస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ క్రమబద్ధీకరణకు తోడ్పడుతాయి. ఫ్రీ రాడికల్స్ వల్ల శరీరానికి నష్టం జరగకుండా కివీ పండ్లు కాపాడుతాయి.

### 6. పటిష్టమైన ఎముకలు

ఎముక పుష్టి ప్రస్తావన వచ్చినప్పుడు మనకు కివీ పండు అనేది అసలు స్ఫురణకే రాదు. కానీ వాస్తవానికి కివీ పండులో ఎముకలను బలోపేతం చేసే ఫోలేట్ ఉంటుంది. ఈ ఫోలేట్ ఎముక నిర్మాణానికి తోడ్పడుతుంది. ఎముకల గట్టి తనానికి కివీలోని విటమిన్ కే కూడా బాగా ఉపకరిస్తుంది. అందుకే గర్భిణిల డైట్‌లో కివీ పండును చేర్చడం చాలా ముఖ్యం.

## ఈ ఆయుర్వేదిక చిట్కాతో 30 రోజుల్లోనే

# శరీరంలోని కొలెస్ట్రాల్ మాయం



శరీరంలో కొలెస్ట్రాల్ ఏర్పడకుండా ఉండేందుకు ఎన్నో మార్గాలున్నాయి. ఆయుర్వేద వైద్యం అనేది ఒక పురాతన వైద్య విధానం. వేదాల్లో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు కూడా ఉన్నాయి. కాకపోతే త్వరిత గతిన ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలను పొందాలన్న ఆశతో ఎక్కువ మంది అల్లోపతి వైద్యాన్ని ఆశ్రయిస్తుంటారు. అల్లోపతితో పోలిస్తే ఆయుర్వేదానికి సంబంధించిన ఏ మందులు తీసుకున్నా సరే సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా వస్తాయి. ఆయుర్వేదంలో కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకుపోకుండా ఒక సింపుల్ చిట్కా ఉంది. భోజనానికి ముందు ప్రతిరోజు ఒక స్పూన్ అల్లం పొడిలో చిటికెడు రాతి ఉప్పును వేసి కలుపుకుని తింటే ఎంతో మంచిది. లేదా దానిని నీటిలో కలుపుకుని తాగినా మంచి ఫలితం ఉంటుంది. భోజనానికి ముందు ఇది తీసుకుంటే శరీరంలో కొలెస్ట్రాల్ ఏర్పడకుండా అడ్డుకుంటుంది. కడుపు ఉబ్బరాన్ని కూడా తగ్గించడంతో పాటు మెరుగైన జీర్ణక్రియను అందిస్తుంది. రాతి ఉప్పు అంటే శుద్ధి చేయని ఉప్పులో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం అధికంగా ఉంటాయి. ఇవి ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడానికి ఉపయోగపడతాయి. అంతే కాకుండా మొత్తం జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. అల్లంలో కూడా ఎన్నో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలను కూడా తగ్గిస్తాయి. అల్లంలో జింజరాల్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అల్లం రక్తంలోని మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఇది రాతి ఉప్పులోని ముఖ్యమైన ఖనిజాలతో కలిస్తే కొలెస్ట్రాల్‌ను సమర్థవంతంగా అడ్డుకుంటుంది. కాబట్టి రాతి ఉప్పు, అల్లం పొడిని వేసి ప్రతి రోజు భోజనానికి ముందు తినడం అలవాటు చేసుకోండి. ఇలా తినడం కాస్త కష్టంగానే ఉంటుంది. అలాంటప్పుడు కాస్త గోరు వెచ్చని నీటిలో ఈ మిశ్రమాన్ని కలిపి తాగితే మంచి ఫలితం ఉంటుంది. అల్లం, రాతి ఉప్పు కలిపి తీసుకోవడం వల్ల పేగుల్లో గ్యాస్ట్రిక్ ఏర్పడడం తగ్గుతుంది. జీర్ణక్రియ లక్షణాలు కూడా బాగా మెరుగుపడతాయి. జీర్ణ రసాలు కూడా ఉత్పత్తి అవుతాయి. పొట్టలోని ఆమ్లాలు అన్నీ సమతుల్యం అవుతాయి. ఇది పోషకాలను బాగా గ్రహిస్తుంది. ప్రతి భోజనానికి 15 నిమిషాల ముందు గోరువెచ్చని నీటిలో ఒక స్పూన్ అల్లం పొడి, చిటికెడు రాతిపొడి వేసి బాగా కలుపుకుని ఆ నీటిని తాగేయాలి. ఇలా తాగిన 20 నిమిషాల తర్వాత భోజనాన్ని తినాలి. ఇలా చేస్తే 30 రోజుల్లోనే మీకు మంచి ఫలితాలు కనిపిస్తుంది. అంతే కాకుండా మీ శరీరంలోని కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com